సాక్షి
రంగారెడ్డి
గురువారం । 30 । మే । 2024



ఆదర్శం..

విద్యావ్యాప్తికి కొత్తూరులోని పరిశ్రమలు నడుం కట్టాయి.ఇప్పటికే రూ.కోట్లు వెచ్చించి పాఠశాల భవనాలను నిర్మించాయి. 8లో▸



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి చెట్ల పొద ల్లోకి దూసుకెళ్లిన ప్రమాదంలోనలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 8లో▸



భారీ మెజార్టీతో గెలుస్తాం

నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని డాక్టర్ మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయండి

డీఈఓ సుశీందర్ రావు



మాడ్గుల: కలకొండ పాఠశాలను సందర్శించిన సుశీందర్ రావు

ఆమనగల్లు: విద్యాసంవత్సరం ప్రారంభం లోగా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని డీఈఓ సుశీందర్‌రావ్ సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఆమనగల్లు మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమనగల్లు మండలం పోలెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ సర్దార్‌నాయక్‌తో త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు చేపడుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలని డీఈఓ సుశీందర్ రావు ఆదేశించారు. మాడ్గుల మండలంలోని కలకొండ, చంద్రాయన్‌పల్లి పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యుత్, వైరింగ్, నల్లాల ఏర్పాటు పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్కూళ్ల రీఓపెనింగ్ వరకు పనులు పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్ నాయక్, ఎంపీడీఓ సరస్వతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని పట్టణాల్లో మినీ స్టేడియాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో షాద్‌నగర్ ఎలెవన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... క్రీడారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. పట్టణాల్లో మినీ స్టేడియాలు నిర్మిస్తామని అన్నారు. అందులో భాగంగా షాద్‌నగర్‌లో రూ.2కోట్లతో మినీ స్టేడియాన్ని అన్ని సదుపాయాలతో సర్వాంగ సుందరంగా నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే కొందుర్గు మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు హరికుమార్, ఎజాజ్, రవూఫ్, రాజేందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ముబారక్, శ్రీను నాయక్, అప్పి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మీర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలన్నారు. జూన్ 1న అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించాలని, జూన్ 2న ప్రభుత్వ ఆస్పత్రులు, అనాథ శరణాలయాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేయాలని, అదే విధంగా జూన్ 3న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో పార్టీ, జాతీయ జెండాలను ఎగురవేయాలని సూచించారు.

9.36 ఎకరాలు | 250 రూ.కోట్లు

గంధంగూడలో చెర వీడిన ప్రభుత్వ భూమి

అక్రమార్కుల భూ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే గండిపేట మండలం పొక్కల్‌వాడ గ్రామ సర్వే నంబర్ 4లోని రూ.500 కోట్ల విలువైన ఐదెకరాలకు జారీ చేసిన పాస్‌బుక్‌లను రద్దు చేసి, భూములను స్వాధీనం చేసుకున్న యంత్రాంగం.. ఇదే మండలం గంధంగూడ సర్వే నంబర్ నం.51లోని రూ.250 కోట్ల విలువ చేసే 9.36 ఎకరాలకు జారీ చేసిన పాస్ పుస్తకాలను కూడా రద్దు చేసి భూములను వెనక్కి తీసుకుంది. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

- గండిపేట తహసీల్దార్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు
- ఇప్పటికే పొక్కల్ వాడలో రూ.500 కోట్ల విలువైన భూములు స్వాధీనం
- అధికార మార్పుతో ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న ఆక్రమణలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా/బండ్లగూడ: సందట్లో సడేమియా అనే చందంగా కొంతమంది అక్రమార్కుల అదను చూసుకుని ప్రభుత్వ భూములను కాజేశారు. అంతా అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉండగా.. వీరు మాత్రం భూములను చెరబట్టే పనిలో నిమగ్నమయ్యారు. గత ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల ఆశీస్సులు, అధికారుల అండదండలు ఉండటంతో విలువైన ప్రభుత్వ భూములను.. ప్రైవేటు పట్టా భూములుగా మార్చేశారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 'ధరణి'లోని లొసుగులను అడ్డం పెట్టుకుని విలువైన భూములను కొల్లగొట్టారు. ఎన్నికల తర్వాత గుట్టుగా సాగిన ఈ వ్యవహారంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో అక్రమార్కుల భూ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

- గంధంగూడ సర్వే నం.51లో 9.36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.
- ఇక్కడ ఎకరం రూ.25 కోట్ల వరకు పలుకుతోంది.
- ఖాళీగా ఉన్న ఈ విలువైన భూములపై ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్నుపడింది.
- ఎలాగైనా వీటిని కాజేయాలని పక్కా ప్రణాళికతో పావులు కదిపాడు.
- ఈ భూమిని చెరబట్టేందుకు 'మంత్రాంగం' నెరిపారు. అధికారుల సహకారం కూడా తోడుకావడంతో 2018 వరకు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమి 2023 మే 27న ప్రైవేట్ వ్యక్తుల పరమైంది.
- అప్పటి కలెక్టర్ ఆగమేఘాల మీద పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేశారు.
- అనంతరం ప్రభుత్వం మారడం.. భూమి పరాధీనమైన విషయం బహిర్గతం కావడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ఆరా తీయడంతో పాటు సమగ్ర నివేదిక కోరారు.
- ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంలో ఉన్నత స్థాయి అధికారుల వరకూ సహకరించినట్లు తేల్చారు.
- ఈ నేపథ్యంలో అప్పట్లో జారీ చేసిన పాస్ పుస్తకాలను రద్దు చేయడమేగాకుండా.. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో వెలిసిన ఆక్రమణలు తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు.
- భూమిని కాజేసేందుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలడంతో ఆక్రమణదారులపై నార్సింగి ఠాణాలో బుధవారం క్రిమినల్ కేసు నమోదు చేశారు.



గంధంగూడలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెలను తొలగిస్తున్న సిబ్బంది

పొక్కల్‌వాడలో ఐదెకరాలు

- గండిపేట మండలం పొక్కల్‌వాడ గ్రామం సర్వే నంబర్ 4లో(1954– 55 ఖాస్రా పహాణీ ప్రకారం) 62.06 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.
- 1986లోనే ప్రభుత్వం ఇందులోని 51.06 ఎకరాలు హుడాకు, మరో 6ఎకరాలు హౌసింగ్ బోర్డుకు కేటాయించింది.
- ఎకరా స్థలంలో బలహీన వర్గాలకు ఇళ్లు కట్టించగా మిగిలిన ఐదెకరాలు ఖాళీగా ఉంది.
- ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా 2012లోనే ప్రహరీ కోసం ప్రతిపాదనలు పంపించి, రూ.36 లక్షలు ఖర్చు చేసి 2015లో కాంపౌండ్ వాల్ నిర్మించారు.
- ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు, రియల్టర్లు కలిసి ఈ భూమిని చేజిక్కించుకునేందుకు పావులు కదిపారు. అంతా ఎన్నికల హడావుడిలో ఉండగా, ఇద్దరు వ్యక్తులు తమ పేరున (చెరో 2.20 ఎకరాల చొప్పున 5ఎకరాలకు) పాస్ బుక్‌లు పొందారు.
- ఈ భూముల విలువ రూ.500 కోట్ల పైమాటే. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఈ అంశంపై స్థానికులు ఫిర్యాదు చేయగా కలెక్టర్ విచారణ చేపట్టారు.
- తెలంగాణ రైట్స్ అండ్ పట్టాదార్ పాస్ బుక్ యాక్ట్ 2020లోని సెక్షన్ 8 కింద పాస్ బుక్‌లు రద్దు చేశారు.
- ఆయా భూములను 22ఏ జాబితాలో చేర్చి, స్వాధీనం చేసుకోవాలని జనవరి 21న ఆదేశాలు జారీ చేయడంతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలోని రెవెన్యూ అధికారుల బృందం ఇటీవల ఆభూములను స్వాధీనం చేసుకున్నారు.
- అడ్డదారుల్లో పాస్‌బుక్‌లు పొంది, భూ ఆక్రమణకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై రాయదుర్గం పీఎస్‌లో కేసు నమోదు చేయించారు.



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీని కూల్చివేస్తున్న సిబ్బంది



జనుము విత్తనాల కోసం మొయినాబాద్ పీఏసీఎస్ వద్ద క్యూకట్టిన రైతులు

విత్తనాల కోసం బారులు

మొయినాబాద్: పచ్చిరొట్ట పైరు విత్తనాల (జనుము) కోసం రైతులు బారులు తీరారు. మొయినాబాద్, కేతిరెడ్డిపల్లి రైతు వేదికల వద్ద బుధవారం ఉదయం 6 గంటల నుంచే చెప్పులను వరుసలో పెట్టి తంటాలు పడ్డారు. రైతు వేదికల దగ్గర ఏఈఓలతో పర్మిట్లు తీసుకొని జనుముల కోసం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయానికి క్యూ కట్టారు. అయితే కేతిరెడ్డిపల్లి క్లస్టర్ ఏఈఓ కుమార్ పరిమితికి మించి పర్మిట్లు ఇవ్వడంతో పీఏసీఎస్ కార్యాలయానికి రైతులు పోటెత్తారు. మండలానికి 220 బస్తాల విత్తనాలు రావడంతో వాటిని రెండు క్లస్టర్ల పరిధిలోని రైతులకు ఇవ్వాలని అధికారులు భావించారు. అయితే కేతిరెడ్డిపల్లి క్లస్టర్ నుంచే ఎక్కువ మంది రైతులకు పర్మిట్లు ఇవ్వడంతో మొయినాబాద్ క్లస్టర్ పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారి రాగమ్మ రెండు క్లస్టర్ల పరిధిలోని రైతులను సముదాయించి విత్తనాలు పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు గురు, శుక్రవారం అందజేస్తామని చెప్పారు.

> **రైతులందరికీ అందిస్తాం**
>
> పచ్చిరొట్ట పైర్లకు సంబంధించిన సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ ఏడాదికి గాను జిల్లాకు 1,778 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉంచాము. ఇప్పటికే 1,447 క్వింటాళ్లు సరఫరా చేశాం. రైతులందరికీ విత్తనాలు అందిస్తాం. అలాగే వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎరువులు కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు.
>
> – గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ఎంఎంటీఎస్ అంటే ఇంత నిర్లక్ష్యమా?

- సీపీఎం నేత శ్రీనివాస్ ఆగ్రహం



ముషీరాబాద్: అత్యంత చవకగా ప్రజలకు అందుబాటులో ఉండే ఎంఎంటీఎస్ రైళ్లను కేంద్ర ప్రభుత్వంతోపాటు రైల్వే శాఖ నిర్లక్ష్యం చేయడంతో ఎంఎంటీఎస్ సర్వీసులు నిర్వీర్యమైపోయిందని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విమర్శించారు. ఎంఎంటీఎస్ ఫేజ్ – 2 కింద రూ.800 కోట్లు ఖర్చు చేసినప్పటికి ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగం లేకుండాపోయిందన్నారు. రైళ్ల సమయ పాలన ఏమాత్రం ప్రజలకు ఉపయోగకరంగా లేవన్నారు. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలు సమయపాలన వివరాలు సమాచార హక్కు చట్టం కింద సేకరించగా నెలలో ఒక రోజు కూడా సమయ పాలన పాటించలేదని ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు ఎవరైనా ఎంఎంటీఎస్‌లో ప్రయాణిస్తారా అని అని ప్రశ్నించారు. ఈ రైలులో రోజూ 10–20 మంది మాత్రమే ప్రయాణిస్తున్నారని ఫేజ్–2 కింద నడుపుతున్న ఇతర రైళ్ల పరిస్థితి ఇంతకంటే దారుణంగా ఉందన్నారు. ఇంతటి దారుణ స్థితికి రైల్వే శాఖ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరమ్మత్తుల పేరుతో రైళ్లను రెగ్యులర్‌గా రద్దు చేస్తుండడంతో ఇప్పటికే ప్రయాణికులు ప్రత్యామ్నాయ రవాణా చూసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయాన్ని సమీక్షించాలని కోరారు.



భరత్‌చంద్ర మృతదేహాన్ని వెలికితీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ప్రాణం తీసిన ఫొటో సరదా

- 'పట్నం' పెద్ద చెరువులో పడి యువకుడి మృతి
- నాలుగు గంటలు శ్రమించి మృతదేహాన్ని వెలికితీసిన ఆర్‌డీఎఫ్ సిబ్బంది



ప్రమాదానికి ముందు భరత్ దిగిన ఫొటో

ఇబ్రహీంపట్నం: ఫొటోలు దిగేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నంలోని ఎంబీఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న భరత్‌చంద్ర (22).. తన తమ్ముడు ప్రవీణ్(19)తో పాటు జోసెఫ్(15) అనే బాలుడితో కలిసి బుధవారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వచ్చాడు. చెరువుకట్ట వద్ద ఫొటో దిగుతుండగా ప్రమాదవశాత్తు భరత్ చంద్ర చెరువులో పడిపోయాడు. ప్రవీణ్, జోసెఫ్ ఇద్దరికీ ఈత రాకపోవడంతో రోడ్డుపైకి వచ్చి సాయం కోసం ఇతరులను వేడుకున్నారు. అయితే అప్పటికే భరత్ చంద్ర చెరువులో పూర్తిగా మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకొని నాలుగు గంటల పాటు శ్రమించి చెరువులో నుంచి భరత్ చంద్ర మృతదేహాన్ని బయటికి తీశారు. కాగా భరత్‌చంద్ర స్థానిక ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడని, అతడి స్వగ్రామం మంచాల మండలం ఆగాపల్లి అని తెలిసింది. ఇబ్రహీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల జారీలో జాప్యం వద్దు

- మీసేవ దరఖాస్తులపై తహసీల్దార్లతో కలెక్టర్ శశాంక సమీక్ష
- గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై దిశానిర్దేశం



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మీసేవ కేంద్రాల ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలకు అందుతున్న దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో.. మండల తహసీల్దార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా, మండల స్థాయిలో జనన, మరణ, కుల ధ్రువీకరణ, ఆదాయ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, రెసిడెన్సీ, ఇతర వెనుకబడిన తరగతుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యాన్ని అధిగమించేందుకు మీసేవ నిర్వాహకులు అనుసరించాల్సిన విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అధిక సంఖ్యలో వచ్చిన అప్లికేషన్లకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా త్వరితగతిన పరిష్కరించాలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మండల స్థాయిలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆపరేటర్లకు డివిజినల్ వారీగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని అధిగమించవచ్చన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, తహసీల్దార్లు, ఈడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్–1కు పకడ్బందీ ఏర్పాట్లు..

జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో.. అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, సంబంధిత అధికారులతో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను మొదటిసారి బయోమెట్రిక్ పద్ధతితో నిర్వహిస్తున్నారని అన్నారు. జిల్లాలో మొత్తం 93 పరీక్ష కేంద్రాల్లో 55,692 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని.. ఎలాంటి పొరపాట్లకు తావియ్యరాదని సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

- త్రిదండి చినజీయర్ స్వామి



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని త్రిదండి చినజీయర్ స్వామి పేర్కొన్నారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులు అంతా ఒక్కచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల స్వర్ణోత్సవాల కమిటీ అధ్యక్షుడు శివరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణను అడ్డుకుంటాం

- జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



రైతులు, నేతలతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: 'రీక్రియేషన్ జోన్' పేరిట రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. హెచ్‌ఎండీఏ ద్వారా ల్యాండ్ పూలింగ్ చేయతలపెట్టిన ఇబ్రహీంపట్నం, శేరిగూడ, ఉప్పరిగూడ, పోచారం, కప్పపహాడ్, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ గ్రామాలకు చెందిన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో ఇబ్రహీంపట్నంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. లేక్ డెవలప్‌మెంట్ జోన్, రీక్రియేషన్ జోన్ తదితర పేర్లతో 8 గ్రామాల్లోని పచ్చటి పంట పొలాలను సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎకరాకు లావణి పట్టా భూములకు 600 గజాలు, పట్టా భూములకు 1,740 గజాల చొప్పున ప్లాట్లు ఇస్తామని.. భూములు రాసివ్వాలని హెచ్‌ఎండీఏ అధికారులు రైతుల వెంట పడుతున్నట్లు తెలిపారు. ప్రజావసరాలు, పరిశ్రమల కోసం భూసేకరణ చేపట్టాలే తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కాదన్నారు. అధికారులకు అంగీకార పత్రాలు ఇచ్చి రైతులు మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. గ్రామాల వారీగా రైతు సమావేశాలను ఏర్పాటు చేసి వారిని సంఘటితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు.. అంజిరెడ్డి, సురేష్, గణేశ్, శంకర్, మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నాటుసారా విక్రేతలపై కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్
- దాడుల్లో మూడు కేసులు నమోదు


నేరెల్లకోల్‌తండాలో నాటుసారా విక్రయిస్తున్న మహిళను అదుపులోని తీసుకున్న పోలీసులు

ఆమనగల్లు: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలలో బుధవారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ బద్యానాద్ చౌహాన్ తెలిపిన వివరాల మేరకు.. కడ్తాల మండలం నేరెల్లకోల్ తండాలో నాటుసారా విక్రయిస్తున్న కేతావత్ మోతీని అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలో బానోత్ శాంతి సారా విక్రయిస్తు పట్టుబడ్డారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామ సమీపంలో నాటుసారా తయారు చేస్తుండగా బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దాడుల్లో నాటుసారాను స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే వివిధ కేసులలో పట్టుబడిన వారిని తహసీల్దార్‌ల వద్ద బైండోవర్ చేయించారు. మాడ్గుల తహసీల్దార్ వద్ద ముగ్గురిని, తలకొండపల్లి తహసీల్దార్ వద్ద ఒకరిని బైండోవర్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా నాటుసారా నిర్మూలనకు అందరూ సహకరించాలని సీఐ కోరారు.

వెనుక నుంచి ఢీకొట్టిన బైక్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


కృష్ణ (ఫైల్)

తలకొండపల్లి: వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టిన ప్రమాదంలో ఓ నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది. ఈ విషాద సంఘటన మండల కేంద్రంలోని దేవకి గార్డెన్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కర్కాస్ తండాకు చెందిన సభావట్ కృష్ణ(45) సొంత పనుల నిమిత్తం బుధవారం ఉదయం కేశంపేట్ మండల కేంద్రానికి బైక్‌పై వెళ్లాడు. పనులు ముగించుకొని వస్తుండగా మార్గమధ్యలో మండల కేంద్రంలోని దేవకి గార్డెన్ సమీపంలో రాగానే వెనుక నుంచి వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కృష్ణ కిందపడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలవ్వడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మణితో పాటు, నలుగురు పిల్లలున్నారు. వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిని మహారాష్ట్రకు చెందిన రంజిత్ చౌహాన్‌గా గుర్తించారు. అతని కాలుకు తీవ్ర గాయం కావడంతో విరిగింది. మెరుగైన చికిత్స నిమిత్తం కల్వకుర్తికి తరలించారు. ఇదిలా ఉండగా మృతి చెందిన కృష్ణ కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ మల్లు రవి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందజేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

- అతివేగంతో అదుపు తప్పిన వైనం
- త్రుటిలో తప్పిన ప్రమాదం


క్రేన్ సహాయంతో బయటికి తీస్తున్న కారు

ఇబ్రహీంపట్నం: వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమై అందులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద చెరువు కట్ట కింది రోడ్డులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలో టీకేఆర్ కమాన్ వద్ద నివసించే శ్రీనుతో పాటు మరో ముగ్గురు బుధవారం ఇబ్రహీంపట్నం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కారులో వస్తున్నారు. స్థానిక కట్ట కింది రోడ్డుపై అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి తూము పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆదర్శం.. దాతల సహకారం

- విద్యావ్యాప్తికి సీఎస్ఆర్ ద్వారా విరాళాలు
- ఆధునిక వసతులతో పాఠశాల భవనాల నిర్మాణం

కొత్తూరు: విద్యావ్యాప్తికి కొత్తూరు మండలంలోని పలు పరిశ్రమలు నడుం కట్టాయి. సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత)లో భాగంగా పరిశ్రమలు ఇప్పటికే రూ.కోట్లు వెచ్చించి పాఠశాల భవనాలను నిర్మించాయి. అంతే కాకుండా నిర్మించిన వాటిల్లో టాయిలెట్స్, భోజనశాల, లైబ్రరీ తదితర మౌలిక సదుపాయాలను కల్పించాయి. విద్యావ్యాప్తి కోసం పరిశ్రమలు చేస్తున్న సేవలను స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు అభినందిస్తున్నారు.



అత్యాధునిక హంగులతో భవనం

మండలంలోని పెంజర్ల–ఇన్ముల్‌నర్వ గ్రామాల శివారులో నెలకొల్పిన పీఅండ్‌జీ పరిశ్రమ తమ అనుబంధ ట్రస్ట్ పీఅండ్‌జీ శిక్ష విద్యావంతి, రౌండ్‌టేబుల్ సహకారంతో పెంజర్ల గ్రామంలో సుమారు రూ.50 లక్షలతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఇందులో విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ఈ భవనంలోనే విద్యార్థులు చదువుకుంటున్నారు.

రాజసం ఉట్టిపడేలా



ప్రముఖ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ నాట్కో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ భవనాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చింది. సీఎస్ఆర్‌లో భాగంగా పరిశ్రమ నాట్కో ట్రస్ట్ సహకారంతో సుమారు రూ.రెండు కోట్లతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. గతేడాది నుంచి భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి.

చివరి దశకు సౌధం నిర్మాణం



సిద్ధాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న ప్రముఖ సినీ హీరో మహేశ్ బాబు అత్యాధునిక వసతులతో కూడిన పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆయనకు చెందిన ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలో పనులు కొనసాగుతున్నాయి. సుమారు రూ.కోటికి పైగా నిధులతో నిర్మిస్తున్న పనులు చివరి దశకు చేరుకున్నాయి.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఆమనగల్లు: పట్టణంలోని ఓ కిరాణా షాపులో నిషేధిత గుట్కా ప్యాకెట్లను బుధవారం ఆమనగల్లు పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ప్రభుత్వం ఇటీవల గుట్కా ప్యాకెట్లను నిషేధించింది. అయినప్పటికీ పట్టణంలోని పలు కిరాణా షాపులలో గుట్కా ప్యాకెట్ల విక్రయాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ రోడ్డులో ఉన్న జె.సతీశ్‌కు చెందిన కిరాణా షాపులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. షాపులో ఉన్న దాదాపు రూ.మూడు వేలు విలువ చేసే గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

తలకొండపల్లి: ఫిల్టర్ ఇసుకను తయారు చేయడానికి అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చుక్కాపూర్ శివారు ప్రాంతంలోని వాగు సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లు, ఒక జేసీబీని పక్కా సమాచారంతో పోలీసులు దాడులు చేసి స్వాధీన పర్చుకున్నారు. అనంతరం వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డ్రైవర్లు రమేశ్, శ్రీను, జంగయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బుధవారం తెలిపారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగి రూ.5.20 లక్షలు అపహరించుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాఘవేందర్ కస్టమర్ సర్వీస్ పాయింట్ మినీ బ్యాంక్ నడుపుతున్నాడు. ఈ నెల 26న ఆయన మంత్రాలయం వెళ్లాడు. ఆ సమయంలో ఆయన దగ్గర ఉన్న రూ.5.20 లక్షల నగదును బ్యాగులో ఉంచి తన తల్లికి ఇచ్చి బీరువాలో ఉంచమన్నాడు. మంగళవారం రాఘవేందర్ మంత్రాలయం నుంచి తిరిగొచ్చాడు. నగదు కోసం బీరువాలో ఉన్న బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో డబ్బులు లేవు. లాకర్‌లో ఉన్న రెండు తులాల నెక్లెస్ సైతం కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో దొంగతనం చేశాడని రాఘవేందర్ భావించారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రవి, మరో వ్యక్తి నరేష్ బుధవారం ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మల్కారం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ వీరి వాహనాన్ని ఢీకొంది. రవి కింద పడిపోవడంతో అతని చెయ్యిపై టిప్పర్ వెళ్లడంతో చేయి నుజ్జునుజ్జు అయింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో యశోద ఆస్పత్రికి తరలించారు. నరేష్‌కు తల, నోటికి గాయాలయ్యాయి. మున్సిపల్ కమిషనర్ తాజ్‌మోహన్ రెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నాలా పనులు పూర్తి చేయండి


మంత్రాల చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: వర్షాకాలం సమీపిస్తున్నందున కార్పొరేషన్‌లో ఎస్ఎన్‌డీపీ నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని మంత్రాల చెరువును ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఎన్‌డీపీ(స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా సుందరీకరణలో భాగంగా అసంపూర్తిగా ఉన్న వాకింగ్ ట్రాక్, ఇతర పనులు చేపట్టాలని.. ముఖ్యంగా చెరువు చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మోడల బాలకృష్ణ, సిద్దాల లావణ్య, ఎస్ఈ ఆంజనేయ ప్రసాద్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఎస్ఎన్‌డీపీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం

కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లు రవి

తలకొండపల్లి: నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభిమానం కాంగ్రెస్ వైపు ఉందని, దీంతో అత్యధిక మెజార్టీతో నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలుస్తానన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉండబోతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమాభివృద్ధి పాలనలో దూసుకుపోతోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జంగయ్య, రవీందర్‌యాదవ్, యాదయ్య, అజీం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు మేశాయంటూ.. మహిళపై దాడి

గొర్రెల కాపరిని కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

మీర్‌పేట: తన ఇంటి మొక్కలు మేశాయన్న కారణంతో గొర్రెలు కాసుకునే మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంగూడకు చెందిన పద్మ ఈ నెల 24వ తేదీన తన గొర్రెలు, మేకలను బృందావన్ కాలనీలో మేపుతుండగా అదే కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి దేవసహాయం ఇంటి మొక్కలను మేశాయి. గమనించిన దేవసహాయం కర్రతో వాటిపై దాడి చేశాడు. దీంతో పద్మ అభ్యంతరం చెప్పి ఆయన్ని తిట్టడంతో పాటు రాయిను విసిరింది. మొక్కలను మేపడమే కాకుండా తనపైకి రాయి విసురుతావా అంటూ దేవసహాయం ఆగ్రహంతో దాడికి యత్నించగా పద్మ పక్కనే ఉన్న పోలీసు ఇన్‌స్పెక్టర్ శామ్సన్ జోసెఫ్ ఇంట్లోకి పరుగెత్తింది. అయినప్పటికీ దేవసహాయం ఆమెను వెంబడించి చీపురుతో దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు పద్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా ఎవరూ లేని సమయంలో తన ఇంట్లోకి ప్రవేశించి ఓ మహిళపై దాడి చేసిన దేవసహాయంపై పోలీసు ఇన్‌స్పెక్టర్ శామ్సన్ జోసెఫ్ కూడా ఈ నెల 27న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. అనంత లోకాలకు

- అదుపుతప్పి ఆటో బోల్తా పడి ఇద్దరి మృతి
- ముగ్గురికి గాయాలు

దామెర: మేడారం సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన కల్లూరి రాణి, తన తల్లి జనరాసుపల్లి లక్ష్మి, బంధువులు చెన్నమ్మ, ఊరడి అనంతమ్మ మంగళవారం రాత్రి సాధుల ప్రభుకు చెందిన ఆటోలో మేడారం బయలుదేరారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఊరుగొండ శివారు పెట్రోల్‌బంక్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లక్ష్మి(68)కి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రాణి, చెన్నమ్మ, అనంతమ్మ, ఆటో డ్రైవర్ ప్రభుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108లో ఎంజీఎం తరలించారు. వారిలో చెన్నమ్మ చెన్నమ్మ (78) చికిత్స పొందుతూ చనిపోయింది. క్షతగాత్రురాలు రాణి ఫిర్యాదు మేరకు అతివేగంతో ఆటో నడిపిన ప్రభుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వారిని ఎస్సై అశోక్ కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.


ఊరుగొండ వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

నేను ముంబైలో ఉన్నా.. పెళ్లి చేసుకున్నా

తల్లికి ఇన్‌స్టాలో కూతురి మెసేజ్

బంజారాహిల్స్: తాను స్నేహితురాలితో వెళ్తున్నానని, తన కోసం వెతకవద్దని ఇన్‌స్టాగామ్‌లో తల్లికి పోస్ట్ పెట్టిన ఓ బాలిక సాయంత్రం తాను ముంబయ్‌లో ఉన్నానని, సైఫ్ అనే యువకుడిని పెళ్లి చేసుకున్నట్లు మరో పోస్ట్ చేసింది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నంబర్–11లోని ఉదయ్‌నగర్‌లో నివసించే బాలిక (14) ఎనిమిదో తరగతి పూర్తి చేసింది. ఇన్‌స్టాగామ్‌లో బాగా యాక్టివ్‌గా ఉంటుంది. సోషల్ మీడియాను బాగా ఫాలో అవుతుంది. ఇందులో భాగంగానే ఇన్‌స్టాలో జహ్రానగర్‌లో సైఫ్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ఈ నెల 17వ తేదీన తన తల్లికి సదరు బాలిక తన స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఈ నెల 22న ఆ బాలిక ఇన్‌స్టాలోనే తాను సైఫ్‌ను పెళ్లి చేసుకున్నానని, ముంబయ్‌లో ఉన్నానని, ఇద్దరూ కలిసి దిగిన ఫొటోను షేర్ చేసింది. కొంతకాలంగా తన కూతురు జహ్రానగర్‌కు వెళ్తుండేదని, సైఫ్ అనే యువకుడు ఇన్‌స్టాలో పరిచయం అయ్యాడని, ఆయనతో వెళ్లిన విషయాన్ని ఇన్‌స్టాలో పోస్ట్ చేసి చెప్పిందని బాధిత తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య


మానస (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన మానస(21) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతుంది. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. యువతిని ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మండిపోతున్న ఎండలు

సాక్షి, సిటీబ్యూరో: మే ఎండలు మండి పోతున్నాయి. సూర్యుడు మళ్లీ నిప్పులు కురిపిస్తున్నాడు. గత వారం రోజులుగా పగలు భానుడు భగ..భగ సాయంత్రం చల్లదనం, వర్షంతో ఉపశమనం పొందిన నగరవాసులు గత రెండు మూడు రోజులుగా ఉష్ణతాపానికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బుధవారం అత్యధికంగా బోలిచౌకిలో గరిష్ట ఉష్ణోగ్రత 43గా నమోదైంది. ముషీరాబాద్, ముసాపేటలో 42.9 డిగ్రీలు నమోదైంది. మిగతా ప్రాంతాలో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది.

హోం గార్డుపై పోక్సో కేసు నమోదు

కాచిగూడ: మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ హోం గార్డుపై పోక్సో కేసు నమోదు చేసిన కాచిగూడ రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన మేరకు.. కుటుంబ సభ్యులతో కలిసి ఓ మైనర్ బాలిక(15) వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్‌లో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. ఆ సమయంలో ఓ హోం గార్డు ప్రతాప్ కోచ్‌లో నిద్రపోతున్న ఆ బాలిక వద్దకు వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అది గమనించిన బాలిక కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు సమాచారమందించారు. బుధవారం ఉదయం కాచిగూడ రైల్వే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కడప రైల్వే కోడూరు పీఎస్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడని, యూనిఫాంలో ఉన్న అతను టికెట్ లేకుండానే రైల్లో ప్రయాణిస్తున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మూడో అంతస్తు నుంచి పడి బాలుడి మృతి

సంతోష్‌నగర్: ఆడుకుంటున్న బాలుడు (8)ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బ్రహ్మచారి తెలిపిన మేరకు.. సంతోష్‌నగర్‌లో అర్భాత్ ఎస్టేట్ బిల్డింగ్‌లోని మూడో అంతస్తులో నివాసముంటున్న సయ్యద్ సోహెబ్ హుస్సేన్ కుమారుడు సయ్యద్ అహ్మద్ హుస్సేన్ (8) వరండాలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో మూడో అంతస్తు నుంచి కిందపడిపోయాడు. బాలుడిని చికిత్స నిమిత్తం ఓవైసీ ఆస్పత్రికి తరలించారు.